క్లుప్తంగా

వేంకటాచలస్వామికి గరుడసేవ



వేంకటాచలస్వామి ఆలయంలో గరుడసేవ

తిరువూరు: స్థానిక పాతతిరువూరులోని వేంకటాచలస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా గరుడ సేవ నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంపై ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన గరుడ సేవలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ తెలిపారు. ఉదయం సుప్రభాతసేవతో ఐదో రోజు ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చకబృందం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్రోచర్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

సిద్ధార్థ ఫార్మసీ కళాశాల్లో క్యాంపస్ సెలెక్షన్స్

నూజివీడు: పట్టణంలోని శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం దివిస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. దీనిలో పీజీ, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, ఐటీఐ వంటి కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు 250 మంది హాజరయ్యారు. వీరిలో 100 మందిని పలు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహన్‌రావు అభినందించారు.

ఘనంగా డోలోత్సవం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనగిరిపై వేంచేసియున్న శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో లక్ష్మీ పూజ, స్వామివార్లకు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో డోలోత్సవం, ఊయలోత్సవాన్ని నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే అంతిమ లక్ష్యం

ముసునూరు: ఎస్సీ వర్గీకరణ సాధనే అంతిమ లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ యంద్రాతి కోటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం నిర్వహిస్తున్న మాదిగ సంగ్రామ పాదయాత్ర బుధవారం మండలంలోని రమణక్కపేట, కంద్రికల మీదుగా నూజివీడు మండలం దిగవల్లికి చేరింది. మహాజన సోషలిస్ట్ పార్టీ నూజివీడు నియోజక వర్గ ఇన్‌చార్జ్ కంకట వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు రుద్రయ్య ఆధ్వర్యంలో పాదయాత్రికులు రమణక్కపేటలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

డొంక రోడ్ల అభివృద్ధికి కృషి

తోలుకోడు(మైలవరం): గ్రామ సర్పంచ్ ఓబులురెడ్డి దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్రి ప్రతాప్, గ్రామస్తుల సహకారంతో తోలుకోడు డొంక రోడ్లు అభివృద్ధి కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. మైలవరం మండలం తోలుకోడులో రైతులు ఉపయోగించే డొంక రోడ్లు 30సంవత్సరాలుగా ముళ్లకంపతో మూసుకుపోయి రైతులకు ఇబ్బందికరంగా మారాయి. స్పందించిన సర్పంచ్ దుర్గారెడ్డి, బుర్రి ప్రతాప్ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో డొంక రోడ్లను పంచాయతీ గుర్తించి దారులు విడగొట్టి రైతులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో పెరట తోటల పెంపకంపై మహిళలకు అవగాహన సదస్సు కేతనకొండలో బుధవారం నిర్వహించారు. డీపీఎఫ్ విజయకుమారి డ్వాక్రా సంఘాల మహిళలతో ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన విధానాలు తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించారు. డీపీఎం బి.భాను పాల్గొన్నారు.

మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం



ఇబ్రహీంపట్నంలో ఉప్పాల హారికను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్



నూజివీడులో 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజను సత్కరిస్తున్న డీఎస్పీ



తిరువూరులో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ కలెక్టర్

ఇబ్రహీంపట్నం: సంపూర్ణ మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఆయన బుధవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మహిళల పేరుతో అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలు గౌరవించబడిన చోట దేవతలు సంచరిస్తారన్నారు. జెడ్పీ ఆధ్వర్యంలో 300 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్‌లో 1000మందికి అందిస్తామన్నారు. 20మంది లబ్ధిదారులకు మిషన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో లబ్ధిదారుల కుట్టు మిషన్లకు ఎమ్మెల్యే వసంత తన కాంట్రిబ్యూషన్ అందిస్తానన్నారు. కేక్ కట్‌చేశారు. చైర్మన్ ఉప్పాల హారిక రాము దంపతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వివిధ మండలాల ఎంపీపీలు పాలడుగు జోత్స్న, వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, ఇస్లావత్ ప్రసన్నరాణి, దేవీప్రావీణ్య పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్‌లో..

ఇబ్రహీంపట్నం: మహిళా దినోత్సవ వేడుకలు కేడీసీసీ బ్యాంక్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. బ్యాంక్ మేనేజర్ సీహెచ్ జాహ్నవి బ్యాంక్ మహిళా ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, మహిళా ఖాతాదారులను సన్మానించారు. సూపర్ వైజర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో సన్‌రైజ్ వైద్యశాల సైకాలజిస్ట్ తేజవతి, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించినప్పుడే..

నూజివీడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సంపూర్ణ స్త్రీ సాధికారత సాధ్యమవుతుందని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. పట్టణంలోని న్యాయస్థానముల భవన ఆవరణలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా జడ్జి కేక్ కట్ చేయగా, డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ జడ్జిని శాలువాతో సత్కరించారు. అనంతరం జడ్జి నాగశైలజ మాట్లాడుతూ నేడు ఎన్నో అవకాశాలున్నాయని, ప్రతి మహిళా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది లేదన్నారు. నేడు దేశంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందని, ఆడపిల్లలకు జన్మనివ్వడంతో పాటు బతకనివ్వాలన్నారు. సమాజంలో ఆడపిల్లల వివక్ష అనేది తల్లి నుంచే మార్పు రావాలన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్, ఎస్ఓఎస్ వంటి వాటిని తీసుకువచ్చిందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్ద ఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయిరామ్, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే విక్రమ్‌కుమార్, భారత్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవాడ నీలాంబరం, మహిళా న్యాయవాదులు పద్మాంజలి, రమాకుమారి, పట్టణ సీఐ ఎం వీవీఎస్ఎన్ మూర్తి, రూరల్ ఎస్సై రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

తిరువూరు: మారుతున్న పరిస్థితుల కనుగుణంగా తమ ఆర్థిక స్వావలంబన సాధనకు మహిళలు సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ నీలపు రామలక్ష్మి అన్నారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. నైపుణ్యం కలిగి ఉంటే ఏ రంగంలోనైనా ముందుంటారన్నారు. మహిళా రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను గురించి వివరించారు. కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, ఏఓ కిషోర్, గైనకాలజిస్టు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్ ఎం.కె.గణేష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తూరు తాడేపల్లిలోని కేడీసీసీ బ్యాంక్ నందు మహిళా బ్యాంక్ ఖాతాదారులను సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎండీ జరీనా పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో..

చాట్రాయి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం వెలుగు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం అశోక్ మాట్లాడుతూ పలు రంగాల్లో మహిళలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆయన చెప్పారు. సీసీలు, వెలుగు మిత్రలను సన్మానించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

సత్యాలపాడు(గంపలగూడెం): మహిళా దినోత్సవాన్ని సత్యాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐదుగురు మహిళా ఉపాధ్యాయులను హెచ్ఎం శేషంరాజు సన్మానించారు.

జగనన్న పాలన మహిళా సాధికారతకు దర్పణం

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మహిళా సాధికారతకు దర్పణం పడుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. పుడమితో పాటు సమస్త ప్రకృతినీ స్త్రీమూర్తిగా ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు. సృష్టికి ప్రతి సృష్టినిచ్చే మాతృమూర్తిగా, గృహిణిగా ఎన్నో త్యాగాలు చేస్తూ, విభిన్న రంగాలలో విశేష సేవలందిస్తున్న మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నిబద్ధతతోనే మహిళల ఎదుగుదల

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): నిబద్ధతతో మహిళల ఎదుగుదల సాధ్యమవుతుందని ఎంపీపీ జోత్స్న అన్నారు. కేతనకొండ జానెట్ విద్యా సంస్థల్లో మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. సర్పంచ్ నళిని ఆకాలత, ప్రిన్సిపాల్ మహబాషా, జేవీవీ ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెలుగు కార్యాలయాల్లో బుధవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ, వైద్యాధికారి స్వాతి, ఆర్.సత్యం పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మహిళా దినోత్సవ వేడుకలను స్థానిక కేడీసీసీ బ్యాంకులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు రమేష్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక సిద్ధార్థా స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, సిద్ధార్థా విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్ హర్షా పాల్గొన్నారు.



వెల్వడంలో మాట్లాడుతున్న జడ్జి షేక్ షిరీన్



సత్యాలపాడు హైస్కూల్లో టీచర్లను సన్మానించిన హెచ్ఎం

సమర్థవంతంగా ఎదుర్కోవాలి

వెల్వడం(మైలవరం): సమాజంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని మైలవరం సివిల్ కోర్టు జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. మైలవరం మండలం వెల్వడం దళితవాడలో ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ, సర్పంచ్ ధర్మరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధిపై అడుగులు వేయాలి

మైలవరం: మహిళలు ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గిరిజా సత్యకుమారి తెలిపారు. మహిళా దినోత్సవం వేడుకలు మైలవరం మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం గిరిజా సత్యకుమారిని సత్కరించారు.

స్త్రీలను గౌరవించాలి

ముసునూరు: స్త్రీని మాతృమూర్తిగా, సబలగా, ప్రబల శక్తిగా గుర్తించి, అందరూ గౌరవించి, ఆదరించాలని రమణక్కపేట హైస్కూల్ హెచ్.ఎం సందిపాము శారద అన్నారు. మండలంలోని రమణక్కపేటలో హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ మేరీ మెటిల్డా ఆధ్వర్యంలో ఆర్‌సీఎం విచారణ ఫాదర్ డా.జేమ్స్ దేవ సహాయం అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ పి.భార్గవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓను వెలుగు సిబ్బంది సత్కరించారు.

సంచార పశుఆరోగ్య వాహనం ప్రారంభం



పశు ఆరోగ్య సేవల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం: ఇంటిముంగిటకే పశువులకు ఆరోగ్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవల వాహనం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికతో కలసి బుధవారం ప్రారంభించారు. గతంలో నియోజకవర్గంలో ఒక వాహనం ఉండేదని ఇప్పుడు జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు ప్రత్యేక వాహనం కేటాయించారన్నారు. పశువులకు ఆరోగ్య సమస్యలు ఉంటే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు చెప్పాలన్నారు. పశువైద్యులు ఇళ్లకు వచ్చి వైద్యం అందిస్తారు. అవసరమైతే వాహనంలో పశువును వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేపై అవగాహన



డ్రోన్ సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వరహాల రాజు

చాట్రాయి: డ్రోన్ సర్వేతో భూసమస్యలు పరిష్కారమవుతాయని డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వరహాల రాజు తెలిపారు. మండలంలోని సోమవరం గ్రామంలో 3వ రోజున నిర్వహించిన డ్రోన్ సర్వేపై రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓఆర్ఎస్ మ్యాపు ద్వారా భూమి చిత్ర పటాన్ని డ్రోన్ అందిస్తుందన్నారు. ఈ చిత్రం ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల భూమల సరిహద్దులు గుర్తించి సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభన్‌బాబు, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో రోడ్ల నిర్మాణం



వేమవరం కాలనీలో రబ్బీషు రోడ్లు నిర్మాణం

విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లి గ్రామ శివారు వేమవరం కాలనీలో రూ.6 లక్షలతో రెండు రబ్బీషు రోడ్లను గ్రామ పంచాయతీ నిర్మిస్తోంది. పంచాయతీ సాధారణ నిధులను వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నామని సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు తెలిపారు. విజయవాడ-విసన్నపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లేందుకు ఒక రోడ్డు, కాలనీ లోపల మరో రోడ్డును నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా హోలీ



పోతనపల్లి తండాలో రంగులు చిమ్ముకుంటున్న యువకులు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం హోలీ వేడుకను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పోతనపల్లిలో గిరిజన తండా యువతీ యువకులు రంగులు చిమ్ముకుంటూ అంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం స్వీట్లు, రొట్టెలు పంచుకుని విందులో పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే రక్షణనిధి



గంపలగూడెం మండలం పెనుగొలనులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రక్షణనిధి



జేజేఎం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పెనుగొలను(గంపలగూడెం): సంక్షేమ పథకాల రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలను-1 సచివాలయ పరిధిలో నాల్గవ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోటు ఏరియా, కొత్తదళితవాడ ప్రధాన రహదారుల వెంట తిరిగి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం చేపట్టిన అభివృద్ధి పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాల లబ్ధితో ముంద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశార. ఆర్‌అండ్‌బీ రహదారిగా ఉన్న ప్రధాన రహదారి వెంట పూర్తి స్థాయి పక్కా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై అధికారులతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరచాలని కోరారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ సంగెపు లలిత, ఎంపీటీసీ సభ్యులు వడ్డెబోయిన శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు బొల్లా కరుణాకరరావు, శేషగిరిరావు, సునీత, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటి సరఫరా

పెనుగొలను(గంపలగూడెం): ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో రూ. 46.33 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం పైపులైన్ విస్తరణ కుళాయి కనెక్షన్ల ఏర్పాటు పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు.

రమణీయం వేణుగోపాలస్వామి కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి తిరుకల్యాణోత్సవం మంగళవారం రాత్రి రమణీయంగా జరిగింది. గంపలగూడెం మండల నెమలి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి కల్యాణాన్ని జరిపారు. అశేష భక్త జనం వీక్షిస్తుండగా నిండు పున్నమి వెన్నల్లో విద్యుత్ కాంతులు, భాజ భజంత్రీలు, సన్నాయి మేళాలు మోగుతుండగా అర్చక స్వాములు స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ శ్రీరామవరప్రసాదరావు దేవతామూర్తులకు నూతన వస్త్రాలు సమర్పించారు. 260 మంది దంపతులు కన్యాదానం చేశారు. పెళ్లి కుమారుడైన స్వామిని ఆలయ వద్దకు గరుడవాహనంపై, పెండ్లి కుమార్తెలైన రుక్మిణీదేవి సత్యభామను అలంకరించి పల్లకీలో కల్యాణ వేదిక వద్దకు భక్తులు తోడ్కొని వచ్చారు. స్వామి కల్యాణం బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. అనంతరం తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. రూరల్ డీసీపీ మేరీ ప్రశాంతి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీలు రమేష్, నాగేశ్వరరెడ్డి, తిరువూరు సీఐ భీమరాజు, గంపలగూడెం ఎస్సై సతీష్ పర్యవేక్షణలో 250మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ట్రాక్టర్ రివర్స్ పోటీ

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ పోటీ బుధవారం రాత్రి ముగిసింది. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలో 40 మంది పాల్గొని ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ చేశారు. ప్రథమస్థానంలో కొణిజెర్లకు చెందిన రహీం, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నెమలికి చెందిన రామకృష్ణ, నాగరాజు, శ్రీనులు నిలిచినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పేరంటాళ్లమ్మ జాతర



పూజలు అందుకున్న అచ్చంపేరంటాళమ్మ



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

పేరంటాళ్లగుట్ట(గంపలగూడెం): వినగడప శివారు పేరంటాళ్ల గుట్ట వద్ద అచ్చంపేరంటాళమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి జాతర అట్టహాసంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి వినగడప నుంచి బయలుదేరి గ్రామరాశి ప్రభబండి తెల్లవారుజామున ఆలయం వద్దకు చేరుకుంది. తదుపరి అమ్మవారికి జాతర ప్రారంభించారు. ఈ సంవత్సరం దాతల సహకారంతో భక్తులకు మహాఅన్నదానం చేశారు. ఐదువేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

'వలసపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించండి'

ముసునూరు: గ్రామ పంచాయతీగా ఏర్పడి 15 ఏళ్లు దాటినా పాత రెవెన్యూ గ్రామంగా కొనసాగించడంపై వలసపల్లి గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులకు మొర పెట్టుకున్నారు. తహసీల్దార్ సుధ అధ్యక్షతన మంగళవారం రాత్రి వలసపల్లి సచివాలయంలో సభనిర్వహించారు. సర్పంచ్ దామోదర్, ఉపసర్పంచ్ డీవీ సుబ్బారావు అధికారికంగా తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా అన్ని రికార్డుల్లో గుర్తించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓ రాణి, పర్యవేక్షకుడు సాయిరాము, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో నవీన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో కూలికి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, పలువురు స్థానికులు కలిసి రైతు ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బండి జార్జి(62) ఈ నెల మూడో తేదీ అదే గ్రామానికి చెందిన నాగరాజుకు చెందిన మొక్కజొన్న చేలోకి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్విచ్ వేయడానికి వెళ్లిన జార్జి విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. దీంతో అతడ్ని నూజివీడులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి అనంతరం విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి సాయంత్రం రైతు నాగరాజు ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. గ్రామ పెద్దలు రైతుతో, మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివాదం లేకుండా సమస్యను పరిష్కరించడంతో ఆందోళనను విరమించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఆగిరిపల్లి: మహిళపై దాడి చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు బుధవారం తెలిపారు. ఆగిరిపల్లి ఎస్సీవాడకు చెందిన నల్లమోతు జ్యోతి అదే ప్రాంతంలోని చిల్డ్రన్ ఆఫ్ లైట్ అనే అనాథ పిల్లల హాస్టల్ హోంలో కేర్‌టేకర్‌గా పని చేస్తోంది. ఈ నెల 6న మార్నింగ్ వాకింగ్ వెళ్లి వస్తోంది. విద్యార్థులు శాండీ, దినేష్ చెత్త పారవేసి వస్తుండగా కూరపాటి అశోక్ తన ట్రాక్టర్‌పై వేగంగా వచ్చి దినేష్‌ను పిలిచి అతడిపై దాడి చేశాడు. ఈ క్రమంలో అడ్డుపడిన జ్యోతిని అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమెపై కూడా దాడి చేశాడు. విషయం తెలుసుకున్న అశోక్ బంధువులు మరో ముగ్గురు వచ్చి జ్యోతిపై దాడి చేశారు. దీంతో గాయాలపాలైన ఆమె నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.